# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించే "మీ భూమి- మీ హక్కు" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

2. **తెలంగాణలో మూసీ నది రెండో దశ ప్రక్షాళన పనులకు వచ్చే 100 రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం గ్రామంలో నిర్వహించే "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పాల్గొంటారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసి, వారితో సమావేశం కానున్నారు. అనంతరం ప్రజా వేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

--------------------------

తెలంగాణలో మూసీ నది రెండో దశ ప్రక్షాళన పనులకు వచ్చే 100 రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని – ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నిన్న దృశ్య మాధ్యమం విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, నాగోల్ నుంచి గౌరెల్లి వరకు రెండో దశ మూసీ నది ప్రక్షాళన పనులను ప్రారంభిస్తామని తెలిపారు. భూ సేకరణతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలుకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. మూసీ నది ఒడ్డున నివసించే పేదలకు కొత్త ఇళ్లు అందించడంతో పాటు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

--------------------------

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిశ్రమలు, రైల్వేలు, జాతీయ రహదారులు, పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా ఆంధ్రప్రదేశ్ లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని అన్నారు. రాష్ట్రంలో 69 లక్షల మందికి ముద్ర రుణాలు అందాయని కేంద్ర మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ 28 సెకన్లు

--------------------------

తపాలా శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల సదుపాయం కల్పించే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని ఆంధ్రప్రదేశ్ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో తపాల శాఖ నిర్వహించిన "సబ్ డివిజనల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025-26" కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తపాలా శాఖ సేవల్లో గజపతినగరం ప్రతిభ చాటడం గర్వకారణమని  అన్నారు.

--------------------------

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా కీలకమని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో జరిగిన సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా వల్ల ఏకాగ్రత పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గి శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని మంత్రి తెలుపుతూ..

వాయిస్ ..25..సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రష్యా పర్యటన చేపట్టినట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ప్రవాస భారతీయులతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ,  ఆంధ్రప్రదేశ్ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని  గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని జూనియర్ కళాశాలలో శిక్షణ పొందుతున్న నూతన ఉపాధ్యాయులతో ఆమె నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా

మంత్రి మాట్లాడుతూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

తెలంగాణలోని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఉబ్బసం రోగులకు ఇచ్చే చేప మందు పంపిణీ కార్యక్రమం ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈసారి మృగశిర కార్తె రాత్రి 9 గంటలకు ప్రారంభమవుతున్నందున అదే సమయంలో చేప మందు పంపిణీ మొదలవుతుందని, రేపు రాత్రి వరకు కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు.

---------------------------

ప్రజా సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున విధానాలపై సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు చురుకుగా వ్యవహరించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా సమావేశంలో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రజలతో అనుసంధానానికి సమర్థవంతమైన వేదికగా మారిందన్నారు. ప్రజా సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సామాజిక మాధ్యమాలను సమర్థంగా వినియోగించాలని కార్యకర్తలకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు, పలు ప్రాంతాల్లో వడగాల్పుల ప్రభావం ఉండే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ద్రోణి ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయని తెలిపింది.

=====================